

నేడు ఓటరు ముసాయిదా ప్రదర్శన

ఆమనగల్లు , సెప్టెంబరు 12: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశానురం శుక్రవారం ఆమనగల్లు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో ఓటర్ల ముసాయిదాను ప్రదర్శించనున్నట్లు ఎంపీడీవో కుసుమ మాధురి తెలిపారు. గురువారం ఈమేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. అభ్యంతరాలు ఉంటే 14 నుంచి 21వ తేదీ వరకు మండల పరిషత్ కార్యాలయంలో ఫిర్యాదు చేయొచ్చని పేర్కొన్నారు. స్వీకరించిన ఫిర్యాదులను జిల్లా అధికారులకు పంపించి అభ్యంతరాలను పరిశీలించి తుది ఓటరు జాబితాను ప్రదరిస్తామని తెలిపారు. 19వ తేదీన ఓటర్ల ముసాయిదాపై రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహిస్తామని ఆమె తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ బాధ్యత అందరిది



శిక్షణలో టీచర్లు, ప్రొఫెసర్లతో సీజీఆర్ ప్రతినిధులు

కడ్తాల్, సెప్టెంబరు 12: పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్, ప్రొఫెసర్ హరిసర్వోత్తమన్ అన్నారు. జీవవైవిధ్యం దెబ్బతింటే మానవాళి మనుగడకు ప్రమాదమన్నారు. అన్మాస్‌పల్లి సమీపంలోని దిఎర్త్ సెంటర్‌లో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్, రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన స్కూల్ ఎర్త్‌క్లబ్, యంగ్ ఎర్త్ లీడర్స్ రెండో విడత అవగాహన కార్యక్రమం గురువారం ముగిసింది. కౌన్సిలర్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ వ్యవస్థాపకులు లక్ష్మారెడ్డి, అధ్యక్షురాలు లీలాలక్ష్మారెడ్డిల అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి హరిసర్వోత్తమన్, ప్రముఖ విద్యావేత్త ఉపేందర్‌రెడ్డి, మహబూబ్‌నగర్ డీఎస్‌వో శ్రీనివాస రావులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సదస్సులో మహబూబ్‌నగర్, నారాయణపేట, నాగర్‌కర్నూల్ జిల్లాలకు చెందిన 66 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. హరిసర్వోత్తమన్ మాట్లాడుతూ జీవ వైవిధ్య ప్రాముఖ్యతను ప్రతీ పౌరుడు గుర్తెరిగి మసులుకోవాలన్నారు. ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ప్రాథమిక దశనుంచే పర్యావరణ, జీవన విలువలు, నైపుణ్యాలు నేర్పి భవిష్యత్తులో పరిరక్షకులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. లీలాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ప్రతీ పాఠశాల ఒక ఎర్త్‌సెంటర్‌గా రూపాంతరం చెందాలన్నారు. సీజీఆర్ సంస్థ సభ్యులు డాక్టర్ సాయిభాస్కర్‌రెడ్డి, పర్యావరణ శాస్త్రవేత్త ఉమామహేశ్వర్‌రెడ్డి, సీజీఆర్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



జైపాల్‌రెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏచూరి(ఫైల్)

ఏచూరితో ఎనలేని బంధం

- ఉమ్మడి జిల్లా నేతలతో సత్సంబంధాలు
- పలు భూపోరాటాల్లో పాల్గొన్న సీతారాం ఏచూరి

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)

సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం ఉమ్మడి జిల్లా వాసులను విషాదంలో నింపింది. కొన్ని దశాబ్దాలుగా ఏచూరికి ఉమ్మడి జిల్లాతో అనుబంధం ఉంది. ఇక్కడ జరిగిన అనేక భూపోరాటాలు, ఉద్యమాలు, సమావేశాల్లో పాల్గొన్నారు. ఇబ్రహీంపట్నం, మియాపూర్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, ఈసీఐఎల్, హయత్‌నగర్, మంచాలలో జరిగిన అనేక భూపోరాటాల్లో ఆయన స్వయంగా పాల్గొన్నారు. అంతేకాక 2022లో తుర్కయాంజల్‌లో జరిగిన సీపీఎం రాష్ట్ర మహాసభలకు విచ్చేశారు. అలాగే తమ్మినేని వీరభద్రం నిర్వహించిన సామాజిక పాదయాత్రలో పాల్గొనేందుకు ఆయన ఇబ్రహీంపట్నం వచ్చారు.

కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డితో సన్నిహితంగా..

ఉమ్మడి జిల్లాలోని అనేక మంది నేతలతో ఆయనకు మంచి సంబంధాలు ఉండేవి. ముఖ్యంగా మాజీ కేంద్ర మంత్రి జైపాల్‌రెడ్డితో విద్యార్థి దశ నుంచే అత్యంత సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. దీంతో జైపాల్‌రెడ్డి మరణానంతరం మాడ్గులలో జరిగిన జైపాల్‌రెడ్డి విగ్రహావిష్కరణకు ఆయన కుటుంబీకులు సీతారాం ఏచూరిని ముఖ్యఅతిథిగా ఆహ్వానించారు. అలాగే మాజీ ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములతో పాటు తెలంగాణ రాష్ట్ర పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు డీజీ నర్సింహారావుతో కూడా మంచి సంబంధాలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో నర్సింహారావు సీపీఎం జిల్లా కార్యదర్శిగా పనిచేసిన సమయంలో ఇక్కడ జరిగిన అనేక భూపోరాటాలు, సభలు, సమావేశాలకు సీతారాం ఏచూరి హాజరయ్యారు. ఆయన మరణం వామపక్షాలకే కాకుండా దేశరాకీయాలకు తీరని లోటని డీజీ నర్సింహారావు పేర్కొన్నారు. అలాగే సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు శోభన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన స్ఫూర్తితోనే తాను ఎస్ఎఫ్ఐలో చేరి ఉమ్మడి జిల్లా ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడిగా ఏడు సంవత్సరాలు పనిచేసినట్లు తెలిపారు. సెంట్రల్ యూనివర్సిటీలో జరిగిన రెండు సెమినార్లకు ఆయన్ని ముఖ్య అతిథిగా ఆహ్వానించామని చెప్పారు. ఆయన మరణం దేశానికి తీరని లోటు అని పేర్కొన్నారు.

ఆక్రమణలో కొత్తచెరువు

ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో వెంచర్ ఏర్పాటు

కబ్జాల పర్వం 13

- యథేచ్ఛగా ప్లాట్ల ఏర్పాటు.. సుమారు మూడెకరాలు మాయం
- ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం
- ఏళ్లు గడుస్తున్నా చోద్యం చూస్తున్న అధికారులు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న కొంగరకలాన్ ప్రజలు



ఆక్రమణలతో కుచించుకుపోయిన కొత్త చెరువు

ఆదిభట్ల మండలం కొంగరకలాన్ గ్రామ పరిధిలోని కొత్త చెరువు రియల్ వ్యాపారుల భూదాహంతో భారీగా ఆక్రమణలకు గురైంది. ఎఫ్‌టీల్ పక్కనే ఉన్న భూమిలో వెంచర్ ఏర్పాటు చేసిన ఓ రియల్ సంస్థ ఎఫ్‌టీఎల్‌లోనూ రోడ్లు, ప్లాట్లను ఏర్పాటు చేసింది. అంతటితో ఆగకుండా బఫర్‌జోన్‌ను సైతం వెంచర్‌లో కలిపేసుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన ప్లాట్లను అమాయకులకు అంటగట్టి అక్రమంగా సొమ్ము చేసుకున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.

ఆదిభట్ల, సెప్టెంబరు 12: ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలోని కొంగరకలాన్ గ్రామం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 338అ, 338ఆ లో ఉన్న కొత్త చెరువు 18.077 ఎకరాలుగా గుర్తించి హద్దు రాళ్లు పాతారు. మరో రెండెకరాలు బఫర్ జోన్ ఉన్నట్లు తేల్చారు. గొలుసుకట్టు చెరువులలో ఒకటైన ఈ చెరువు రియల్ వ్యాపారుల ధనదాహం వలన ఆక్రమణలకు గురైంది. దీంతో ఈ చెరువు పెద్దపెద్ద వర్షాలు కురిసి వరదలు వచ్చినా పూర్తిగా నిండని పరిస్థితి నెలకొంది. కొత్త చెరువు పక్కన ఉన్న పట్టా భూమి సర్వే నంబర్ 339, 340లలో నగరానికి చెందిన ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ 2013లో 15 ఎకరాలలో ఓ వెంచర్ వేసింది. ప్లాట్లు చేసే క్రమంలో కొత్త చెరువు ఎఫ్‌టీఎల్‌లో హద్దు రాళ్లను తొలగించి కొంత మేర ఆక్రమించి ప్లాట్లను చేశారు. అంతటితో ఆగకుండా చెరువు బఫర్‌జోన్‌ను కూడా కలిపేసుకున్నారు. ప్లాట్లు చేసి బీటీ రోడ్డులు వేసి ఆదిభట్లలో ఆ సమయంలో నెలకొల్పొని టీసీఎస్ సంస్థను చూపించి ప్లాట్లను విక్రయించారు. టీసీఎస్‌లో పనిచేసే హైదరాబాద్‌తోపాటు ఇతర రాష్ట్రాలకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఇబ్బడిముబ్బడిగా ప్లాట్లు కొనుగోలు చేశారు. సదరు వెంచర్ పార్కు తదితర ప్రజా అవసరాల కోసం వదలాల్సిన భూమిని అధిక శాతం చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లోనే వదిలి వెంచర్‌ను క్లోజ్ చేశారు. మొత్తంగా ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో మూడెకరాల మేర ఆక్రమణకు గురైనట్లు తెలుస్తోంది. అంటే మార్కెట్ విలువ ప్రకారం ఆక్రమణకు గురైన భూమి విలువ సుమారు రూ.30 కోట్ల పైమాటే.



కొత్తచెరువు బఫర్ జోన్‌లో వెంచర్ ఏర్పాటులో భాగంగా వదిలిన పార్కు స్థలం

పార్కు స్థలం రీసేల్?

పార్కు స్థలం కోసం బఫర్ జోన్‌లో వదిలిన భూమిని సైతం మళ్లీ విక్రయించినట్లు తెలుస్తోంది. గతంలో పార్కు స్థలంగా లే అవుట్‌లో చూపించిన చోట ఇప్పుడు చుట్టూ ఫెన్సింగ్ వేసి కనిపిస్తుంది. అంటే ఈస్థలం అధిక ధరకు మళ్లీ ఇతరులకు విక్రయించినట్లు సమాచారం. చెరువు పరిధిలో ఇంతటి విధ్వంసం జరుగుతున్నా రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం గమనార్హం. అధికారులకు అన్ని తెలిసి కూడా చర్యలకు వెనకాడుతున్నారంటే కారణం ఎమై ఉంటుందో చెప్పాల్సిన పనిలేదని జనం చర్చించుకుంటున్నారు. చెరువులను చెరబట్టిన రియల్ వ్యాపారులు భూదాహాన్ని అరికట్టి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి



కొత్త చెరువు బఫర్ జోన్‌ను ఆక్రమించి వెంచర్ వేసిన సదరు రియల్ ఎస్టేట్ సంస్థపై చర్యలు తీసుకోవాలి. పార్కు స్థలం ఇంకా ప్రజా అవసరాల కోసం వదిలిన భూమి పూర్తిగా బఫర్ జోన్‌లోనే ఉందని గతంలో పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు శూన్యం. ఆదిభట్ల మున్సిపల్ జనరల్ కౌన్సిల్ సమావేశంలో సైతం పలుమార్లు ఈ సమస్యను ప్రస్తావించినా చర్యలు లేవు. ఇప్పటికైనా చెరువును ఆక్రమించిన రియల్ వ్యాపారులపై హైడ్రా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి.

-గోపగళ్ల మహేందర్,
కౌన్సిలర్, ఆదిభట్ల మున్సిపాలిటీ

రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించాలి

- డీలర్ల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మీనారాయణగౌడ్



సివిల్ సప్లై రాష్ట్ర కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రేషన్ డీలర్ల సంఘం నాయకులు

మహేశ్వరం, సెప్టెంబరు 12: కాంగ్రెస్ మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా రేషన్ డీలర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్‌బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ పి.లక్ష్మీనారాయణగౌడ్ అన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర సివిల్ సప్లై కమిషనర్‌తో పాటు ప్రిన్సిపల్ సెక్రటరీ డీసీ చౌహాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీలర్లందరికీ గౌరవ వేతనం చెల్లించాలని అదేవిధంగా హెల్త్ కార్డులు మంజూరు చేయాలని కోరామనానరు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో డీలర్లకు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చాలని వినత పత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం నాయకులు హనుమాన్లు, భానుచందర్, సత్తయ్య, భాస్కర్‌రెడ్డి, వీరస్వామి, రఫీక్, కృష్ణగౌడ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

మృత్యు మలుపులు!

గ్రామీణ రోడ్లలో పదుల సంఖ్యలో మలుపులు

- కనిపించని సూచిక బోర్డులు
- తరచూ జరుగుతున్న ప్రమాదాలు
- పట్టించుకోని ఆర్అండ్‌బీ అధికారులు
- ఆందోళనలో యాచారం మండల ప్రజలు

యాచారం, సెప్టెంబరు 12: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లపై ఉన్న మూలమలుపులు ప్రమాదకరంగా మారాయి. కనీసం సూచికబోర్డులు కూడా లేకపోవడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరగుతున్నాయి. దీంతో ఆయా రోడ్లలో ప్రయాణించాలంటేనే వాహనదారులు జంకుతున్నారు. నందివనపర్తి - చిన్నతూండ్ల, చౌదర్‌పల్లి - చిన్నతూండ్ల గ్రామాల మధ్య రోడ్డు మూలమలుపులతో ఇబ్బందికరమంగా మారాయి. చిన్నతూండ్ల నుంచి కందుకూరు మండలం కొలన్‌గూడ గ్రామాల మధ్య నాలుగు చోట్ల మూలమలుపులున్నాయి. ఈ రోడ్డుపై ద్విచక్ర వాహనాదారులు, కార్లు అతివేగంతో వెళ్తుండడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. ఇటీవల అతివేగంగా వెళ్తున్న ఓ బైక్ మలుపుల వద్ద బోల్తా పడటంతో నలుగురు యువకులు గాయాలపాలయ్యారు. అలాగే కారు, బైక్‌లు త్రుటిలో పెను ప్రమాదం నుంచి బయటపడడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

వరుస ప్రమాదాలు

నందివనపర్తి నుంచి చిన్నతూండ్ల గ్రామాల మధ్య రెండు చోట్ల, చిన్నతూండ్ల నుంచి చౌదర్‌పల్లి గ్రామాల మధ్య మూడు చోట్ల ప్రమాదకర మలుపులున్నాయి. ఇటీవల చిన్నతూండ్లలో రెండు బైక్‌లు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదం జరిగిన పక్షం రోజులకే రెండు బైక్‌లు ఢీ కొట్టుకోవడంతో ఇరువురు యువకులు తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలయ్యారు. చౌదర్‌పల్లి నుంచి యాచారం గ్రామాల మధ్య రెండు చోట్ల, నాగార్జున సాగర్ - చౌదర్‌పల్లి గ్రామాల మధ్య మూడు చోట్ల మూలమలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి, మూలమలుపుల వద్ద ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని ఆర్అండ్‌బీ అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని ఆటోడ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



గున్‌గల్ రిజర్వాయర్ సమీపంలోప్రమాదకరంగా మూలమలుపు



చిన్నతూండ్ల - కొలన్‌గూడ గ్రామాల మధ్య మలుపు

సూచిక బోర్డుల అపహరణ

తాటిపర్తి నుంచి నానక్‌నగర్ గ్రామాల మధ్య వెంచర్ సమీపంలో మూలమలుపులు చాలా ప్రమాదకరంగా ఉన్నాయి. నానక్‌నగర్ వాగు సమీపంలో రెండు చోట్ల మూలమలుపులు చాలా ప్రమాదకరంగా ఉన్నాయి. దీంతో ఈ దారిలో ప్రయాణించాలంటే వాహనాదారులు ఇబ్బందులు పడుతున్నారు. నాగార్జునసాగర్ - హైదరాబాద్ ప్రధాన రహదారిపై గున్‌గల్ రిజర్వాయర్ వద్ద రెండు చోట్ల మూలమలుపుల వద్ద గతంలో సీఐ లిక్కి కృష్ణంరాజు సూచిక బోర్డులు ఏర్పాటు చేయించారు. అయితే వాటిని గుర్తు తెలియని దుండగులు అపహరించారు. ఈ విషయం తెలిసిన యాచారం పోలీసులు ఆర్అండ్‌బీ శాఖల అధికారులు మూలమలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయని పరిస్థితి. గున్‌గల్ గేటు సమీపంలో ఇటీవల రెండు బైక్‌లతో పాటు కారు బైక్‌లు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందడంతో పాటు ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. రిజర్వాయర్ సమీపంలో మూలమలుపుల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పోలీసులకు తెలిసినా నిర్లక్షం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. తాటిపర్తి నుంచి మేడిపల్లి గ్రామాల మధ్య 7 చోట్ల, మేడిపల్లి నుంచి తక్కళ్లపల్లి మీదుగా నాగార్జున సాగర్- హైదరాబాద్ ప్రధాన రహదారి వరకు 5 చోట్ల మూలమలుపులున్నాయి. ఈ విషయం తెలిసినా ఆర్ అండ్‌బీ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అవసరమైన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి



హైదరాబాద్- నాగార్జున సాగర్ ప్రధాన రహదారిపై గున్‌గల్ రిజర్వాయర్ వద్ద, చౌదర్‌పల్లి గేటు సమీపంలోని మూలమలుపుల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు సూచికబోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో చౌదర్‌పల్లి గేటు వద్ద అనేక ప్రమాదాలు జరిగాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి బారికేడ్లు ఏర్పాటు చేసి, వాహనదారులకు తెలిసేలా సూచికబోర్డులు ఏర్పాటు చేయాలి.

- నడికూడి కృష్ణ, చౌదర్‌పల్లి

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



ఉపాధ్యాయులకు సూచనలు ఇస్తున్న రామేశ్వరిదేవి

ఆమనగల్లు, సెప్టెంబరు 12: పదో తరగతిలో వసతి గృహ విద్యార్థినులంతా ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రామేశ్వరి దేవి కోరారు. ఆమనగల్లు పట్టణంలో గిరిజన బాలికల వసతి గృహాన్ని గురువారం ఆమె తనిఖీ చేశారు. వసతి గృహ రికార్డులు, పరిసరాలు, గదులు, మరుగుదొడ్లు, మూత్రశాలలను పరిశీలించారు. సమస్యలపై విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రామేశ్వరి దేవి మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతపై దృష్టి సారించాలని, సీజనల్ వ్యాధుల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. టీచర్లు, వసతి గృహ సిబ్బంది ఉన్నారు.

ప్రజాపాలన పేరిట కాంగ్రెస్ దుర్మార్గం

శాసనసభ మాజీ స్పీకర్ మధుసూదనాచారి

బీఆర్ఎస్ ఎమ్మెల్యేల తరలింపులో హైడ్రామా

ఆయా పోలీస్ స్టేషన్ల వద్ద ఉద్రిక్త పరిస్థితులు



తలకొండపల్లిలో మాట్లాడుతున్న మధుసూదనాచారి

ఆమనగల్లు, సెప్టెంబరు12: ప్రజాపాలన పేరుతో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తుందని శాసనసభ మాజీ స్పీకర్ మధుసూదనాచారి మండిపడ్డారు. ప్రభుత్వ ఆగడాలను ఎదుర్కోవడానికి నాటి తెలంగాణ ఉద్యమ పోరాట తరహాలో పోరాడతామన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై ఎమ్మెల్యే గాంధీ అనుచరుల దాడికి నిరసనగా మాజీ మంత్రి హరీశ్‌రావు ఆధ్వర్యంలో మాజీ శాసనసభ స్పీకర్ మధుసూదనాచారి, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, మాగంటి గోపీనాథ్, బండారి లక్ష్మారెడ్డి, వివేకానంద, సంజయ్, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజులు నిరసన తెలుపుతుండగా వారిని అరెస్టు చేసిన పోలీసులు గురువారం రాత్రి తలకొండపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అప్పటికే ఈ విషయం తెలుసుకున్న స్థానిక బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు స్టేషన్ వద్ద మోహరించారు. అక్కడ 20 నిమిషాల పాటు ఉంచిన అనంతరం వారిని మళ్లీ ఇతర ప్రాంతాలకు తరలించారు. ఈ సందర్భంగా మాజీ స్పీకర్ మదుసూదనాచారి తలకొండపల్లి పీఎస్ వద్ద విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ అనుచరులు దాడికి వస్తున్నారని పోలీసులకు సమాచారమిచ్చినా స్పందించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌశిక్‌రెడ్డిపై దాడికి పాల్పడిన ఎమ్మెల్యే అరికపూడి గాంధీపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని. దాడి చేసిన వారిని తక్షణమే అ రెస్టు చేయాలని డిమాండ్ చేశారు. హరీశ్‌రావు ఆధ్వర్యంలో సీపీ కార్యాలయం ఎదుట నిరసనకు దిగిన తమను తమ పార్టీ ఎ మ్మెల్యేలను అరెస్టు చేసి రాత్రంతా వివిధ పోలీస్ స్టేషన్లకు తిప్పడం విచిత్రంగా ఉందన్నారు.

పాకిస్థాన్ పాలనను తలపిస్తున్న రేవంత్ సర్కారు తీరు : ఎర్రోళ్ల శ్రీనివాస్

కొత్తూర్ : ముఖ్యమంత్రి రేవంత్ పాలన పాకిస్థాన్‌ను తలపిస్తుందని ఎస్సీ కమిషన్ మాజీ ఛైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ఆరోపించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ వద్ద చోటుచేసుకున్న ఉద్రిక్తతల కారణంగా పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎస్సీ కమిషన్ మాజీ ఛైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను కొత్తూర్ మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ మీదుగా కేశంపేట పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తుండగా, ఇన్ముల్ నర్వ గ్రామం వద్ద బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అజయ్ నాయక్, శివచారి ఆధ్వర్యంలో కార్యకర్తలు పోలీస్‌వ్యాన్‌కు అడ్డు తగిలారు. దాంతో అక్కడ ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. పోలీసులు ఆందోళనకారులను చెదరగొట్టి అక్కడి నుంచి కేశంపేటకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ రేవంత్ పాలన రాక్షస పాలనగా మారిందని దుయ్యబట్టారు. న్యాయం చేయాలని ఆందోళన చేస్తే అక్రమంగా అరెస్టులు చేశారన్నారు.



మాట్లాడుతున్న ఎర్రోళ్ల శ్రీనివాస్

పెంజర్ల అనంతపద్మనాభుడి సేవలో హైకోర్టు జడ్జి



అనంతపద్మనాభస్వామిని దర్శించుకున్న హైకోర్టు జడ్జి శ్రీసుధ

కొత్తూర్, సెప్టెంబరు 12: మండల పరిధిలోని పెంజర్ల గ్రామ శివారులో వెలసిన అనంతపద్మనాభస్వామి ఆలయాన్ని గురువారం హైకోర్టు జడ్జి శ్రీసుధా దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు జడ్జికి ఆలయ చైర్మన్ బెజవాడ అనితారెడ్డి, కొత్తూర్ మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో శ్రీసుధా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు తీర్థప్రసాదాలు ఇచ్చి ఆశీర్వచనాలు అందజేశారు. పద్మనాభస్వామి దర్శనం ప్రశాంతత కలిగించిందని, ఆలయాన్ని సుందరంగా నిర్మించారని జడ్జి కితాబిచ్చారు. కార్యక్రమంలో షాద్‌నగర్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సూరజ్‌సింగ్, కొత్తూర్ ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు, ఎస్సై జి.శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యుడు మామిడి దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సేవల్లో పారదర్శకత ఉండాలి



భూ రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

కొడంగల్, సెప్టెంబరు 12: భూ సంబంధిత, ధరణి సమస్యల పరిష్కారంలో పారదర్శకత పాటించాలని సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ సూచించారు. గురువారం కొడంగల్ తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ధరణి, భూ సంబంధిత సమస్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను భద్రతపర్చే గదిని పరిశీలించారు. తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రైతులకు ధరణి పోర్టల్‌తో సమస్యలు ఎదురుకాకుండా ఎప్పటికప్పుడు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులు, దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని, సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించరాదని తెలిపారు. అనంతరం రికార్డులపై తహసీల్దార్ విజయ్‌కుమార్‌ను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు.

స్పీకర్‌ను కలిసిన ఎమ్మెల్యే శంకర్



షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 12: అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్‌గా నియమించడంతో కలిసి కృతజ్ఞతలు తెలిపినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. స్పీకర్ తనపై పెట్టిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని శంకర్ తెలిపారు.

మేడ్చల్ జిల్లాలో అత్యధికంగా
సభ్యత్వ నమోదు చేయించాలి



మేడ్చల్ టౌన్ : గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో సభ్యత్వాలు నమోదు చేయిస్తున్న జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి



ఘట్‌కేసర్ : సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న బీజేపీ నాయకులు

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 12 : జిల్లాలో అత్యధికంగా పార్టీ సభ్యత్వాలు నమోదు చేయించాలని మేడ్చల్-మల్కాజిగిరి రూరల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో విక్రమ్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై నేడు యువకులు, మహిళలు పెద్దఎత్తున తమ పార్టీలో సభ్యత్వం పొందుతున్నారన్నారు. జిల్లాలోని మారుమూల గ్రామాల్లో సైతం అత్యధికంగా సభ్యత్వం నమోదు చేయించాలన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ క్షేత్ర స్థాయిలో బలోపేతంగా తీర్చిదిద్దటానికి సభ్యత్వ నమోదు కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందన్నారు. నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ అమరం మోహన్‌రెడ్డి, కౌన్సిలర్ మల్లికార్జున్ ముదిరాజ్, అమరం సరస్వతి, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ ముదిరాజ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదుపై దృష్టి సారించాలి

ఘట్‌కేసర్ : పార్టీ సభ్యత్వ నమోదుపై దృష్టి సారించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్ అన్నారు. ఘట్‌కేసర్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పార్టీ శ్రేణులు సభ్యత్వ కార్యక్రమంను యజ్ఞంలా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఇన్‌చార్జులు వెంకట్‌రెడ్డి, నర్సింగరావు, అచ్చిని నర్సింహ, నాయకులు అంజనేయులు, రామోజీ, మహేష్, శ్రీరాములు, రామతీర్థ, ప్రవీణ్‌రావు, సురేష్, మహిపాల్‌రెడ్డి, ప్రభంజన్, సిద్ధిరాజు, రాధిక పాల్గొన్నారు.

కేంద్రపథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి



సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న అంజయ్య యాదవ్, లచ్చిరెడ్డి

మంచాల, సెప్టెంబర్ 12: ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఆదరణ పొందాలని బీజేపీ మండల ఇన్‌చార్జి మర్పల్లి అంజయ్యయాదవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జి.లచ్చిరెడ్డి శ్రేణులకు పిలుపునిచ్చారు. భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదును గురువారం మంచాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ప్రతీ బూత్‌లో రికార్డు సభ్యత్వ నమోదు చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ దన్నె బాషయ్య, మండల అధ్యక్షుడు పాండాల జంగయ్య, రాష్ట్రనేత వింజమూరి వెంకట్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, నూకంరాజు, బండిరాజు, చివిరాల పాండు, అనిరెడ్డి వెంకట్‌రెడ్డి, రేణుక, శక్తికేంద్రం ఇన్‌చార్జి మెందు వెంకట్‌రెడ్డి, మల్ల శ్రీశైలం, రాజు, గౌర వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే అభివృద్ధి

మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి



మాణిక్యమ్మ గూడలో సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన అనంతరం గ్రామస్తులతో మాట్లాడుతున్న సబితారెడ్డి

మహేశ్వరం, సెప్టెంబరు 12 : బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి తప్పా.. ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వంలో అభివృద్ధి జరగడం లేదని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. గురువారం మహేశ్వరం, మాణిక్యమ్మగూడ గ్రామాల్లో రూ.80లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ బీఆర్‌ఎస్ హయాంలో విడుదలైన నిధులు తప్పా.. కొత్తగా అభివృద్ధికి నిధులు విడుదల చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. మహేశ్వరం నియోజకవర్గం అభివృద్ధిలో రాష్ట్రంలోని ఇతర నియోజకవర్గాలకు ఆదర్శంగా నిలవాలని తాము చూస్తుంటే.. కొందరు కాంగ్రెస్ నాయకులు మాత్రం అభివృద్ధిని అడుగడుగునా అడ్డుకొంటున్నారని ఆరోపించారు. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా గొంతులో ప్రాణం ఉన్నంత వరకు ప్రజలకోసమే పని చేస్తానన్నారు. మహేశ్వరంలో మెడికల్ కళాశాల ఏర్పాటుకు కేసీఆర్ కృషి చేశారని, అది మరిచిపోయి కాంగ్రెస్ నాయకులు వారు సాధించినట్లు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. విద్య, వైద్యాన్ని గాలి కొదిలేసిన ప్రభుత్వ తీరు కారణంగా అనేక మంది పేదలు నానా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అంతకుముందు సబితారెడ్డి మహేశ్వరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో పాటు కస్తూర్బా బాలికల పాఠశాలను సందర్శించి సౌకర్యాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కేజీబీవీలో తాగునీరు, టాయిలెట్లు ఇతర సమస్యలు ఎక్కువగా ఉన్నాయని ఎమ్మెల్యే దృష్టికి పలువురు విద్యార్థినులు తీసుకెళ్లగా.. వెంటనే పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని తెలిపారు.

వరిపైర్లను పరిశీలించిన శాస్త్రవేత్తలు



ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 12 : ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, మర్రిపల్లిగూడ, ఎదులాబాద్‌లలో గురువారం సాయంత్రం భారతీయ వరి పరిశోధన సంస్థ- రాజేంద్రనగర్ శాస్త్రవేత్తలు వరిపైర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు వరిపైర్లకు పట్టిన ఉల్లికోడు తెగులును పరిశీలించి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు సూచించారు. ఉల్లికోడు తెగులును ప్రారంభంలోనే అరికట్టాలని, లేదంటే కొంగీక తెగులు వలే వ్యాపించి వరిపైర్లను నాశనం చేస్తుందని శాస్త్రవేత్తలు తెలిపారు. సాయంత్రం వేళల్లోనే ఉల్లికోడు తెగులు వ్యాపిస్తుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు వైజ శ్రీధర్, ఎపీ పద్మకుమారి, మండల వ్యవసాయ అధికారి ఎంఏ బాసిత్, ఏఈవో జగదీష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వర్షాలతో నష్టపోయిన వారిని ఆదుకోవాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మీ పండిట్



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న విజయలక్ష్మీ పండిట్

వికారాబాద్, సెప్టెంబరు 12 : భారీ వర్షాల కారణంగా చాలా ప్రాంతాల్లో నష్టపోయిన వారిని ప్రభుత్వం ఆదుకొని పరిహారం ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మీ పండిట్ ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు గురువారం కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆమె మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతులకు రూ.15 వేల పరిహారం ఇవ్వాలని, పూర్తిగా పంట నష్టం జరిగితే రూ.50 వేలు అందించాలన్నారు. ఇళ్లు కూలిపోయిన వారికి కొత్తగా గృహాలు కట్టించాలన్నారు. వరదల వల్ల అంటు వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని, ఉచిత వైద్య సేవలు అందించడానికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత తీసుకోవాలని కోరారు. తెలంగాణలో కురిసిన వర్షాలు, వరదలను కేంద్రం జాతీయ విపత్తుగా ప్రకటించాలని, రాష్ట్రానికి అన్నివిధాలా సహాయ సహకారాలు అందించాలన్నారు. సత్వరమే రూ.2వేల కోట్ల ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. నాయకులు అనంతయ్య, వెంకటేశ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలి

కొడంగల్, సెప్టెంబరు 12: ఎడతెరిపి లేకుండా కురిసిన పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని సీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మీ పండిత్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి గంటి సురేశ్‌కుమార్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో గురువారంకలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు వారు వినతిపత్రం అందజేశారు. భారీ వర్షాల కారణంగా రైతులు సాగుచేసిన పంటలు తీవ్రంగా నష్టపోయామన్నారు. పంట సాగు కోసం వేలాది రూపాయలు ఖర్చు చేసిన రైతులకు తీరని నష్టం వాటిల్లడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిహారాన్ని వెంటనే అందించాలన్నారు. అదేవిధంగా వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలుతుండటంతో గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బాబ్యానాయక్, భీమేశ్, రాజునాయక్, రమేశ్‌రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.



శామీర్‌పేట : పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పీడీ సత్తిరెడ్డి



తలకొండపల్లి : ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు విద్యార్థుల ఎంపిక

తలకొండపల్లి/శామీర్‌పేట, సెప్టెంబరు 12 : రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ ఖోఖో పోటీలకు తలకొండపల్లి మండలం వెల్జాల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. సరూర్‌నగర్ స్టేడియంలో జిల్లా సబ్ జూనియర్ ఖోఖో బాలబాలికల టోర్నమెంట్ నిర్వహించారు. ఈమేరకు పాఠశాల నుంచి 13 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో పి.బన్ని, బాలికల జట్టు కె.తేజస్వినిలు ఎంపికైనట్లు పీడీ పరమేశ్ తెలిపారు. వారిని గురువారం పాఠశాల ఆవరణలో సత్కరించి జ్ఞాపికలు బహూకరించారు. నేటి నుంచి 15 వరకు హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు నసీమా, ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా శామీర్‌పేట మండల పరిధిలోని తూంకుంట జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు బాలుర విభాగంలో జి.సాయి, ఉదయ్‌కిరణ్, అనిల్, హేమంత్‌రావు, బాలికల విభాగంలో అలేఖ్య, మౌనికలు రాష్ట్ర స్థాయిలో ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పీడీ గుర్రం సత్తిరెడ్డి వెల్లడించారు.

నేవీ హెడ్‌క్వార్టర్‌ను సందర్శించిన పరిగి ఎమ్మెల్యే



నేవీ అధికారులతో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, సెప్టెంబరు 12 : ఢిల్లీలోని కేంద్ర నేవీహెడ్‌క్వార్టర్‌ను గురువారం పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సందర్శించారు. సంబంధిత అధికారులతో కలిసి నేవీరాడార్(జలంతర్గాములు)లను వీక్షించి, వాటి పనితీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే పరిగి నియోజకవర్గంలోని పూడూరులో నేవీరాడార్ స్టేషన్ ఏర్పాటుకు శంకుస్థాపన చేయనున్నట్లు వారికి ఎమ్మెల్యే వివరించారు.

108 అంబులెన్స్‌లో మహిళ ప్రసవం

కవల పిల్లల(మగ, ఆడ)కు జన్మనిచ్చిన తల్లి



కవల పిల్లలతో ఈఎంటీ, కుటుంబికులు

బషీరాబాద్, సెప్టెంబరు 12: పురిటి నొప్పులతో బాధపడుతున్న ఓ గర్భిణీని ఆసుపత్రికి తరలిస్తుండగా అంబులెన్స్‌లో ఇద్దరు కవల పిల్లలను ప్రసవించింది. ఈ సంఘటన ధారురు మండల పరిధిలో గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. కులకచర్ల మండలంలోని ముజాయిత్‌పూర్ గ్రామానికి చెందిన చంద్రకళకు పురిటి నొప్పులు రాగా కుటుంబికులు 108కు సమాచారం అందించారు. బషీరాబాద్ మండలానికి చెందిన అంబులెన్స్‌లో తాండూరులోని మాతా శిశు ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి కండిషన్ సీరియస్‌గా ఉందని, హైదరాబాద్ నీలోఫర్‌కు తీసుకెళ్లాలని సూచించారు. హైదరాబాద్‌కు వెళుతుండగా ధారురు సమీపంలో పురిటినొప్పులు అధికమయ్యాయి. పైలెట్ శివకుమార్ వాహనాన్ని పక్కకు నిలుపగా.. గర్భిణి కవల పిల్లల(ఆడ, మగ)కు జన్మనిచ్చింది. కాగా, మగ బిడ్డకు ఈఎంటీ శాంత్‌కుమార్ సీపీఆర్ చేయడంతో స్పృహలోకి రావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఎల్లకొండ పరిసరాల్లో మూవీ షూటింగ్ సందడి



ప్రముఖ హాస్యనటుడు బ్రహ్మానందంతో ఎమ్మెల్యే యాదయ్య

నవాబుపేట, సెప్టెంబరు 12: మండలంలోని ఎల్లకొండ పరిసరాల్లో గురువారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. పార్వతీపరమేశ్వరుల ఆలయ ఆవరణలో నిర్వహించిన సినిమా చిత్రీకరణలో ప్రముఖ హాస్యనటుడు బ్రహ్మానందం పాల్గొన్నారు. ఈక్రమంలో అటుగా వెళ్తున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అయన్ను మర్యాదపూర్వకంగా కలిసి ఫొటో దిగారు.

అప్పన్న చెరువు వద్ద శాంతి పూజలు



శాంతి పూజ నిర్వహిస్తున్న మత్స్య సహకార సంఘం నాయకులు

తలకొండపల్లి, సెప్టెంబరు 12: మండల పరిధిలోని పడకల్ అప్పన్న చెరువు అలుగు వద్ద గురువారం శాంతి పూజలు నిర్వహించారు. స్థానిక మత్స్య సహకారం సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో మత్స్యకారులు, ముదిరాజ్ సంఘం నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఇటీవల భారీ వర్షాలు కురిసి చెరువులోకి పెద్దఎత్తున వరద నీరు రావడంతో శాంతి పూజలు చేపట్టారు. కట్టమైసమ్మ దేవతకు మొక్కులు చెల్లించుకున్నారు. మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు నూకం శేఖర్, ఉపాధ్యక్షుడు రాములు, నాయకులు కుమార్, శివానంద్, అంజయ్య, రాము, రాములు, కిష్టయ్య, యాదయ్య, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా రమేశ్ గుప్తా



నియామక పత్రం అందుకుంటున్న రమేశ్ గుప్తా

కీసర, సెప్టెంబరు 12: మేడ్చల్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా బెలిదే రమేశ్ గుప్తా ఎన్నికయ్యారు. తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్వర్యంలో గురువారం జగద్గిరిగుట్టలో మేడ్చల్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష పదవికి ఎన్నికలు జరిగాయి. కీసర గ్రామానికి చెందిన రమేశ్ గుప్తా ఘన విజయం సాధించారు. తన గెలుపు కొరకు కృషిచేసిన ప్రతీ ఒక్కరికి రమేష్ కృతజ్ఞతలు తెలియజేయగా, పలువురు అయన్ను సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు.

బీసీలు సంఘటితం కావాలి



మాట్లాడుతున్న చేవెళ్ల స్వామి

షాబాద్, సెప్టెంబరు 12 : బీసీలు సంఘటితం కావాలని బీసీ ఐక్యవేదిక నాయకులు చేవెళ్ల స్వామి, బీసీ సే న జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ అన్నారు. గురువారం షాబాద్‌లో గౌడసంఘ భవన్‌లో బీసీ ఐక్య వేదిక ఆధ్వర్యంలో బీసీ నాయకుల సమావేశం నిర్వహించారు. బీసీ నాయకులు చేవెళ్ల స్వామి, బీసీసేన జాతీయాధ్యక్షుడు బర్క కృష్ణ, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు గడ్డం చంద్రయ్య, బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహులు, నా యీ బ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు సత్యనారాయణ, ముదిరాజ్ సంఘం మండల ప్రధాన కా ర్యదర్శి మాసయ్య, గౌడ సంఘం మండల అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చట్టసభల్లో రిజర్వేషన్లు పెంచాలన్నారు. జనాభాలో అత్యధికంగా ఉన్న బీసీలకు స్థానిక సంస్థల్లో అన్యాయం జరుగుతోందన్నారు. బీసీలంతా సంఘటితం అయితేనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. కా ర్యక్రమంలో బీసీ నాయకులు కూర వెంకటయ్య, రవీందర్, రాజేందర్‌గౌడ్, శ్రీను, రాజు, దర్శన్, చందిప్ప జంగ య్య, రామకృష్ణ, నర్సింహులు, విఠలయ్య, గోపాల్, బిక్షపతి, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాల కబ్జాకు యత్నం

చర్యలు తీసుకోవాలి గ్రామస్తుల వినతి



ఆర్డీవో కార్యాలయం అధికారికి వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

చేవెళ్ల, సెప్టెంబరు 12 : పేదల భూములను కబ్జాచేస్తున్న రియల్ బ్రోకర్లపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని సీఐటీయూసీ చేవెళ్ల డివిజన్ కన్వీనర్ దేవేందర్ డిమాండ్ చేశారు. గురువారం చేవెళ్ల మండల పరిధిలోని దుద్దాగు గ్రామంలోని సర్వేనెంబర్ 52లో ఉన్న భూమిలో రైతులకు, పేదలకు దివంగత వైఎస్ఆర్ హయాంలో ఇళ్ల పట్టాలు ఇచ్చారని తెలిపారు. నాటి నుంచి నేటి వరకు గ్రామంలోని పేదలు ఆ స్థలాల్లో కబ్జాలో ఉన్నారని, నేడు కొంత మంది రియల్ ఎస్టేట్ బ్రోకర్లు ఆ విలువైన భూములపై కన్నేసారని, పేదలను బెదిరిస్తున్నారని వాపోయారు. రియల్ ఎస్టేట్ బ్రోకర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు తక్షణమే స్పందించి పేదలకు న్యాయం చేయాలన్నారు. లేనియెడల సీపీఎం ఆధ్వర్యంలో ఆ స్థలంలో ఎర్రజెండాలు పాతి న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామన్నారు. మండల నాయకులు నర్సింలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సోలార్ ప్లాంట్‌తో వంద ఎకరాల్లో పంట నష్టపోయాం



మెమొరాండం అందజేస్తున్న రైతులు

తాండూరు రూరల్, సెప్టెంబరు 12 : సోలార్ ప్లాంట్ వాటర్ వల్ల ఆ ప్లాంట్ చుట్టుపక్కల ఉన్న రైతులు వంద ఎకరాల్లో పంట నష్టపోయినట్లు అన్నదాతలు ధర్నాకు దిగారు. తాండూరు మండల పరిధిలోని జినుగుర్తి రైతులు గురువారం సోలార్ ప్లాంటు గేటు ఎదుట ధర్నా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహులు, పలువురు రైతులు మాట్లాడుతూ ప్లాంటు వల్ల తీవ్రంగా పంట నష్టపోతున్నామని, రైతులకు పరిహారం కింద ఎకరాకు రూ.20వేల చొప్పున చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రామంలోని ఊరడవ్వ గుడి నుంచి శ్రీరాముల వారి ప్రాజెక్టు వరకు రోడ్డు నిర్మిస్తామని సోలార్ యజమానులు హామీ ఇచ్చి నెరవేర్చలేదని ఆరోపించారు. సమస్యను పరిష్కరించకపోతే ధర్నా కొనసాగిస్తామని హెచ్చరించారు. అనంతరం సోలార్ ప్లాంట్ ఇన్‌చార్జి పవన్‌కుమార్‌కు మెమొరాండం అందజేశారు. రైతు సంఘం సీనియర్ నాయకులు గురువా నర్సింహులు, రవిగౌడ్, మొగులప్ప, విజయ్‌కుమార్, ఒలిగిరి రాములు, నర్సింహులు, రాములు, మాణిక్యప్ప, పెద్దోళ్ల ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

చేవెళ్ల కోర్టు సీనియర్ న్యాయాధికారి దశరథ రామయ్య



విజేత జట్టుతో న్యాయాధికారులు, పోలీసులు

చేవెళ్ల, సెప్టెంబరు 12 : యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రీడల్లో రాణించాలని చేవెళ్ల కోర్టు సీనియర్ న్యాయాధికారి దశరథ రామయ్య, జూనియర్ సివిల్ జడ్జి కిరణ్‌కుమార్ అన్నారు. గురువారం చేవెళ్ల పోలీస్‌ల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ స్టేడియంలో ఫ్రెండ్లీ వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. మొత్తం 14 టీమ్‌లు పాల్గొన్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలీస్‌లతో పాటు మీడియా జర్నలిస్టులు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన యువత వాలీబాల్ టోర్నమెంట్‌లో తలపడ్డారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో న్యాయాధికారులు ప్రథమ బహుమతి పోలీస్ టీమ్, ద్వితీయ బహుమతి దేవునిఎర్రవల్లి టీంలకు బహుమతులు అందజేశారు. డ్రగ్స్ నివారణకు యువత తోడ్పాటు అవసరం అన్నారు. క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకొని ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. సీఐలు భూపాల్ శ్రీధర్, రమేశ్‌నాయుడు, ఎస్సైలు శ్రీకాంత్‌రెడ్డి, ప్రదీప్‌కుమార్, పోలీస్ సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలను విస్తరించాలి



విఠల్‌రెడ్డిని అభినందిస్తున్న జిల్లా పాస్ట్ గవర్నర్ రాధాకృష్ణ

కందుకూరు, సెప్టెంబరు 12 : లయన్స్ క్లబ్ సేవలను గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మరింత విస్తరించాలని, అన్ని క్లబుల్లో సభ్యత్వాలను ముమ్మరం చేయాలని క్లబ్ జిల్లా పాస్ట్ గవర్నర్ ఎస్.రాధాకృష్ణ కోరారు. కందుకూరు క్లబ్ అధ్యక్షుడిగా ఎన్నికైన ఎస్.విఠల్‌రెడ్డితో కందుకూరులోని టంకరి రాంరెడ్డి ఫంక్షన్ హాల్‌లో బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన ప్రమాణ స్వీకారోత్సవంలో క్లబ్ జిల్లా వైఎస్ గవర్నర్ జి.మహేంద్రకుమార్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. కందుకూరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా ఎన్నికైన విఠల్‌రెడ్డి, కార్యదర్శి జగదీశ్వర్‌రెడ్డి, కోశాధికారి కుంచకూరి వెంకటేశ్వర్లుగుప్తాలు సేవా కార్యక్రమాలను చేపట్టాలన్నారు. క్లబ్ రీజియన్ చైర్మన్ టి.శ్రీనివాస్, జోన్ చైర్‌పర్సన్లు జనార్ధన్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, కార్యదర్శి ఇ.బుచ్చయ్య, ఆమనగల్లు, జిల్లెలగూడ, అధ్యక్షులు పి.లక్ష్మారెడ్డి, సుధాకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి, కందుకూరు లయన్స్‌క్లబ్ మాజీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

పండుగలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

షాబాద్, సెప్టెంబరు 12: పండుగలను ప్రజలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి అన్నారు. గురువారం షాబాద్ పోలీస్‌స్టేషన్‌లో డీజే ఓనర్లు, ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా, నిమజ్జనం రోజు డీజేలకు పర్మిషన్ లేదని తేల్చి చెప్పారు. ఎవరైనా నింబంధనలకు విరుద్ధంగా డీజేలు పెడితే వారిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిమజ్జనం ప్రశాంతంగా పూర్తి చేసుకునేందుకు అందరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు నవీన్‌రెడ్డి, సతీష్ ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి


కందుకూరు మండల పరిషత్‌లో పోషకాహార వస్తువులను తిలకిస్తున్న సీడీపీవో శాంతిశ్రీ, ఎంపీడీవో సరిత

కందుకూరు/కడ్తాల్/ఆమనగల్లు, సెప్టెంబరు 12 : గర్భిణులు రోజూ తప్పకుండా పోషకాహారం తీసుకోవాలని, అప్పుడే ఆరోగ్యవంతమైన శిశువుకు జన్మనిస్తారని మహేశ్వరం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో శాంతిశ్రీ, ఎంపీ డీవో సరిత అన్నారు. గురువా రం మండల పరిషత్‌లో వివిధ గ్రామాల గర్భిణులకు సీమంతాలు, చేసి పోషకాహారంపై అవగాహన కల్పించారు. త్రుణధాన్యాలు, పప్పు దినుసులు, ఆకు కూరలు ఎక్కువగా తినాలన్నారు. పోషకాహార వస్తువుల ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్లు ఇందిర, సబిత, శ్రీలత, టీచర్లు పాల్గొన్నారు. కడ్తాల్ మండలం రావిచెడ్‌లో పౌష్టికాహార వారోత్సవాలను నిర్వహించారు. పోషకాలున్న ఆహారాన్నే భుజించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శబరి అన్నారు. గ్రామంలో పోషకాహార ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలో పోషక పదార్థాల ప్రదర్శన నిర్వహించి వాటిపై అవగాహన కల్పించారు. పప్పు దినుసులు, ఆకుకూరలు, గుడ్లు ఎక్కువగా తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సుజాత, వాణిశ్రీ, సువర్ణ, ఏఎన్‌ఎం లలిత, ఆశా కార్యకర్తలు జహేద, మంజుల, అనిత, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ అంగవాడీ కేంద్రాలు 5, 6లలో పోషకాహార వారోత్సవాలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనిత హాజరై పోషక అవగాహన కల్పించారు. 3 నుంచి 6 సంవత్సరాల్లోపు చిన్నారులను అంగన్‌వా డీ కేంద్రాల్లో చేర్పించాలని తల్లులకు వారు సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సంధ్య, పిల్లల తల్లులు తదితరులు పాల్గొన్నారు.


కడ్తాల్: పోషణ వారోత్సవాల్లో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శబరి


ఆమనగల్లు: పోషణ్ అభియాన్ ప్రదర్శనలో సూపర్‌వైజర్ అనిత, అంగన్‌వాడీలు, మహిళలు

దానాలన్నింటిలో అన్నదానం గొప్పది


అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

కొత్తూర్, సెప్టెంబర్ 12: అన్నదానం మహా గొప్పదని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మున్సిపాలిటీలోని రైల్వే స్టేషన్ రోడ్డులో మహావీర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయక మండపం వద్ద ఎమ్మెల్యే పూజల నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జె.వేణుగోపాల్‌గౌడ్, నాయకులు హరినాథ్‌రెడ్డి, జె.సుదర్శన్‌గౌడ్, జగన్, శ్రీనివాస్, ప్రభాకర్, జనార్దన్‌చారి, సురేందర్, జె.శ్రీశైలంగౌడ్, యూత్ సభ్యులు రిషి గౌడ్, ప్రణవ్‌గౌడ్, నీలేష్‌గౌడ్, చందుగౌడ్, విశాల్‌గౌడ్ పాల్గొన్నారు.

గ్రామం మీదుగా హైటెన్షన్ లైన్ వేయొద్దు


తహసీల్దార్‌కు వినతిపత్రమిస్తున్న గ్రామస్తులు

కేశంపేట, సెప్టెంబరు 12: మండల పరిధి పోమాల్‌పల్లి మీదుగా 765 కేవీఏ హైటెన్షన్ విద్యుత్ లైన్ వేయొద్దంటూ గ్రామస్తులు గురువారం తహసీల్దార్ ఆజం అలీకి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మహేశ్వరం నుంచి జడ్చర్ల వరకు నిర్మిస్తున్న హైటెన్షన్ విద్యుత్ లైన్ మార్కింగ్ మార్చాలని తహసీల్దార్‌ను కోరారు. పాత మార్కింగ్ ప్రకారమే లైన్ వేయాలని కోరారు. గ్రామానికి సమీపం నుంచే విద్యుత్‌లైన్ వెళ్తుండడంతో ప్రజలు భయపడుతున్నారని గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కృష్ణయ్య, రమేష్, భూపాల్‌రెడ్డి, రవిశర్మ, ముత్యాల్‌రెడ్డి, చంద్రారెడ్డి, మస్తాన్, మహేష్, నర్సింహులు పాల్గొన్నారు.

చదువుతో పాటు సామాజిక కార్యక్రమాల్లో భాగస్వాములు కండి

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 12: రక్తదానం చేస్తే మరొకరి ప్రాణాలను కాపాడినవారమవుతామని అందుకు యువత ముందుకు రావాలని సిద్ధార్థ విద్యాసంస్థల చైర్మన్ డా.జి.నాగయ్య అన్నారు. ఇబ్రహీంపట్నంలోని కళాశాలలో గురువారం ఉస్మానియా హాస్పిటల్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. చదువుతో పాటు యువత సామాజిక కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలన్నారు. డ్రగ్స్, గంజాయి లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. లక్ష్యం కోసం కష్టపడితేనే మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. శిబిరంలో వంద మంది విద్యార్థులు, అధ్యాపకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో కాలేజీ సెక్రటరీ డా.ప్రదీప్‌కుమార్, ప్రిన్సిపాల్ శేఖర్‌బాబు, ఎన్ఎస్ఎస్ అధికారి సుధాకర్ పాల్గొన్నారు.

'కాంగ్రెస్ పాలనలో ఎమ్మెల్యేలకే రక్షణ కరువు'

మంచాల, సెప్టెంబర్ 12: కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో ఎమ్మెల్యేలకే రక్షణ కరువైందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చీరాల రమేష్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ జానీపాషా అన్నారు. గురువారం మంచాలలో విలేకరులతో మాట్లాడుతూ.. నగరంలో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై కాంగ్రెస్ గూండాల దాడి హేయం అన్నారు. నగరం నడిబొడ్డున ఎమ్మెల్యే ఇంటిపై వందలాది మంది కాంగ్రెస్ గూండాలు దాడి నిరంకుశ పాలనకు నిదర్శనం అన్నారు. ఏళ్లుగా కాపాడుకుంటూ వచ్చిన హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ని నాశనం చేస్తున్నారన్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు.

యాచారం: మాజీ మంత్రి హరీష్‌రావును పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని మండల బీఆర్ఎస్ నాయకులు వి.రాజునాయక్, ఖాజుద్దీన్ అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ తప్పిదాలను ఎత్తిచూపడం నేరమా? అని ప్రశ్నించారు. ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందన్నారు. ప్రభుత్వ విధానాలకు నిరసనగా ఆందోళనలు చేస్తామన్నారు.

శంషాబాద్ రూరల్: హరీష్‌రావు అరెస్టును, ఎమ్మెల్యే కౌశిక‌రెడ్డి ఇంటిపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు మాల్కారం ప్యాక్స్ చైర్మన్ సతీష్ అన్నారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న గూండాగిరిని సహించం అన్నారు. ప్రభుత్వం దాడులను ప్రోత్సహిస్తే బీఆర్ఎస్ నాయకులు కూడా అదే రీతిలో స్పందిస్తారన్నారు. ఎమ్మెల్యే గాంధీకి నైతిక విలువ ఉంటే రాజీనామా చేయాలని సవాలు విసిరారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సతీష్

వేంకటేశ్వరుడి రథ నిర్మాణానికి భారీ విరాళం

షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబర్ 12: షాద్‌నగర్ పట్టణానికి ముఖద్వారంగా వెలిసిన శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి కల్యాణ రథాన్ని నిర్మించేందుకు గాను ఆకుల వెంకటేశం అనే భక్తుడు ఐదు లక్షల 11వేల రూపాయలను విరాళాన్ని ఇచ్చారు. షాద్‌నగర్‌కు చెందిన వెంకటేశం గురువారం ఆలయ అభివృద్ధిని పర్యవేక్షిస్తున్న మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ఆధ్వర్యంలో రథాన్ని నిర్మించడానికి కర్ణాటకలోని గంగావతి నుంచి వచ్చిన శిల్పులకు డబ్బును అందించారు. వెంకటేశ్వరస్వామి ఉత్స వ విగ్రహాలను గర్భగుడి చుట్టు ఊరేగించడానికి కావాల్సిన రథాన్ని నిర్మించడానికి ముందుకు వచ్చి విరాళం ఇచ్చిన వెంకటేశాన్ని నర్సింహులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు వెంకట సాయిశ్వర్‌రెడ్డి, ఒగ్గు కిషోర్, బచ్చలి నర్సింహులు, సూరిశెట్టి నర్సింహులు, రాంభూపాల్, వినోద్, ఆలయ ప్రధాన పూజారి శ్రీనివాసాచార్యులు తదితరులు పాల్గొన్నారు.


రథ నిర్మాణానికి విరాళం ఇస్తున్న ఆకుల వెంకటేశం

ఆత్మస్థైర్యం విజయానికి సోపానం


విజేతలకు షీల్డ్‌లు బహూకరిస్తున్న సీఐ ప్రమోద్‌కుమార్, ఎస్ఐ వెంకటేశ్

ఆమనగల్లు/చౌదరిగూడ,సెప్టెంబరు 12: ఆత్మస్థైర్యం, పట్టుదల విజయానికి సోపానాలని ఆమనగల్లు సీఐ ప్రమోద్‌కుమార్ అన్నారు. విద్యార్థి దశ నుంచే విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించి గుర్తింపు పొందాలని కోరారు. ఆమనగల్లులోని బాలుర పాఠశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలు గురువారం ముగిశాయి. హెచ్‌ఎం పాండు అధ్యక్షతన నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి సీఐ, ఎస్ఐ వెంకటేశ్, ఎంఈవో సర్దార్‌నాయక్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. విద్యార్థులు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు ముఖ్య అతిథులు షీల్డ్‌లు బహూకరించారు. సీఐ మాట్లాడుతూ ప్రతిభ ఉన్న క్రీడాకారులకు చేయూత నివ్వాలన్నారు. క్రీడలు శారీర దారుఢ్యం, మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయని ఎస్ఐ, ఎంఈవో తెలిపారు. కార్యక్రమంలో పీఈడీలు జ్యోతి, రిజ్వాన, వివేక విద్యాభారతి ప్రిన్సిపాల్ మహమూద్, అశోక్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. చౌదరిగూడలోని జడ్పీహెచ్ఎస్‌లో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఏర్పాటు చేసిన క్రీడా పోటీలను తహసీల్దార్ జగదీశ్వర్ ప్రారంభించారు. ఆయన మా ట్లాడుతూ పాఠశాల దశ నుంచే క్రీడలపై పట్టు సాధించాలని సూచించారు. క్రీడలతో నాయకత్వ లక్షణాలు అలవడుతాయని తెలిపారు. జీహెచ్‌ఎం సునీ త, శంకర్‌గౌడ్, నరేందర్, శ్రీనివాస్, కుషాల్, లావణ్య, పార్వతి, రజని, ప్రవీణ్‌కుమార్, రమేష్, శిరీష పాల్గొన్నారు.


విద్యార్థులను పరిచయం చేసుకుంటున్న తహసీల్దార్

విద్యార్థులే దేశ భవిష్యత్తుకు పునాది


ఆరుట్ల మోడల్ స్కూల్ విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్సుల పంపిణీ

మంచాల, ఆంధ్రజ్యోతి, సెప్టెంబర్ 12 : నేటి విద్యార్థులు దేశ భవిష్యత్తుకు పునాదులని లయన్స్ క్లబ్ ఇబ్రహీంపట్నం అధ్యక్షుడు నర్సింహసాగర్ పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ ఇబ్రహీంపట్నం ఆధ్వర్యంలో మంచాల మండలం ఆరుట్ల మోడల్ స్కూల్ విద్యార్థులు 317మందికి గురువారం స్పోర్ట్స్ డ్రెస్సులు పంపిణీ చేశారు. టెన్త్‌లో ఉత్తమ గ్రేడ్ సాధించిన వారికి రూ. 1000 చొప్పున అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ వి.కృష్ణప్రసాద్, మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రమేష్, శ్రీనివాస్, లయన్స్ ప్రతినిధులు వెంకట్‌నారాయణరెడ్డి, జి.శేఖర్ రెడ్డి,కె.వీ.రమేష్‌రాజు, ఎన్.అశోక్, బీంరావు, జె.రవీందర్, పి.బాల్‌రాజు, మల్లేష్‌యాదవ్, వెంకటేష్, సుధాకర్, బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

మొయినాబాద్ రూరల్: క్రీడల్లో రాణించేందుకు తనవంతు ప్రోత్సాహం ఎల్లప్పుడూ ఉంటుందని బీజేపీ నాయకుడు గరుగు రాజు అన్నారు. చిలుకూరు పాఠశాల విద్యార్థులకు 150 జతల స్పోర్ట్ డ్రెస్సులను ఆయన పంపిణీ చేశారు. రాజు మాట్లాడుతూ విద్యార్థులకు విద్య, క్రీడలు రెండూ అవసరమన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు క్రీడల్లో రాణించేందుకు నిరంతరం పోటీలను నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భీమయ్య, టీచర్లు శ్రీనివాస్‌రెడ్డి, యాదయ్య, వేణు, లావణ్య, రాజశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.


స్పోర్ట్స్ డ్రెస్సులను అందజేస్తున్న గరుగు రాజు


జాతీయ రాజకీయాల్లో సీతారాం ఏచూరిది కీలక పాత్ర


ఇబ్రహీంపట్నంలో సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 12: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతిపట్ల సీపీఎం జిల్లా కమిటీ సంతాపం ప్రకటించింది. గురువారం రాత్రి ఇబ్రహీంపట్నం బస్టాండు వద్ద ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి కొవ్వొత్తులతో నివాళ్లర్పించింది. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బి.సామెల్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి అంచెలంచలుగా ఎదిగి జాతీయ రాజకీయాల్లో ఆయన నిర్వహించిన పాత్ర మరువలేనిదన్నారు. ఆయన ఆశయ సాధన కోసం పార్టీ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జగన్, బుగ్గరాములు, వెంకటేష్, శంకర్, మునలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లు: సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి మృతి పట్ల సీపీఎం నాయకులు సంతాపం తెలిపారు. ఆమనగల్లు లో సీపీఎం ఆధ్వర్యంలో సంతాప కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏచూరి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కానుగుల వెంకటయ్య, రఘురాములు, బాలస్వామి, రమేశ్, శంకర్, రాములు, అంజయ్య ఉన్నారు.

అరుదైన బ్రెయిన్ సర్జరీ చేసిన డాక్టర్ రామరాజుకు సన్మానం


డాక్టర్ రామరాజును సన్మానిస్తున్న నర్సింహ

శంషాబాద్ రూరల్, సెప్టెంబరు 12: వైద్య వృత్తిలో అరుదైన బ్రెయిన్ సర్జరీ చేసిన లిమ్స్ చైర్మన్ డాక్టర్ రామరాజు, భరత్‌సింహలను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు చిలకమర్రి నర్సింహ గురువారం శాలువాలతో సన్మానించారు. శంషాబాద్‌లోని లిమ్స్ ఆసుపత్రిలో ఓ రోగికి బ్రెయిన్‌కు ఓ అరుదైన సర్జరీని ఉచితంగా చేసి అతడి ప్రాణాలు కాపాడారు. ఈ నేపథ్యంలో వైద్యులు రామరాజు, భరత్‌సింహలను నర్సింహ అభినందించారు.

వివేకానంద ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యంపై

చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్, డీఈవోలకు జర్నలిస్టుల ఫిర్యాదు



రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 12: చేవెళ్ల మండలం దేవుని ఎర్రవల్లిలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న వివేకానంద ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని పాత్రికేయులు సురేందర్, ప్రవీణ్‌కుమార్‌లు గురువారం కలెక్టర్ శశాంక, డీఈవో సుశీందర్‌రావులకు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వర్కింగ్ జర్నలిస్టు పిల్లలకు 50శాతం ఫీజు రాయితీపై డీఈ వో ఇచ్చిన ప్రొసీడింగ్‌పై కామెంట్ చేసిన వివేకానంద స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఇష్టానుసారం రూ.లక్షల్లో ఫీజు వసూలు చేస్తున్న ఈ స్కూల్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు.

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి


యాదమ్మ మృతదేహం

కొత్తూర్, సెప్టెంబరు 12: కొత్తూరులోని ఉన్నత పాఠశాల వెనుక కాలనీలో ఓ ఇంట్లో అద్దెకుంటున్న చాకలి యాదమ్మ(45) అనే మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు గురువారం తెలిపారు. ఇన్ముల్‌నర్వకు చెందిన యాదమ్మ భర్త గతంలోనే మృతిచెందడంతో ఆమె కొంతకాలంగా కొత్తూర్‌కు వచ్చి అద్దె ఇంట్లో ఉంటూ కూలి పనిచేసుకుంటూ జీవనం సాగిస్తోందన్నారు.గురువారం ఉదయం చుట్టుపక్కల వారు ఆమె చనిపోయినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారన్నారు. తాము వెళ్లి పరిశీలించగా యాదమ్మ నోరు, ముక్కు నుంచి రక్తం కారి నిర్జీవంగా పడి ఉందన్నారు. సంఘటనా స్థలంలో క్లూస్, ఫింగర్ ప్రింట్స్ టీం ఆధారాలు సేకరించిందన్నారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని షాద్‌నగర్ ఆసుపత్రికి తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. యాదమ్మ కుతూరు రేణుక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు చెప్పారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

చేవెళ్ల, సెప్టెంబరు 12 : కుటుంబ కలహాలతో వివాహిత ఇంట్లోనే ఉరి వేసుకున్న సంఘటన శంకర్‌పల్లి మండలంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చందిప్పకు చెందిన మల్లేష్, అతడి భార్య మౌనిక(26) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి పాప, బాబు సంతానం. బుధవారం రాత్రి కుటుంబం విషయంలో భార్యాభర్తలు గొడవపడ్డారు. అర్ధరాత్రి మౌనిక ఇంట్లోనే ఉరేసుకుంది. గురువారం ఉదయం గమనించిన మల్లేష్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు చేరుకొని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం చేవె ళ్ల ఆసుపత్రికి తరలించారు. మౌనిక పుట్టింటి వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పురుగుల మందు తాగి యువతి బలవన్మరణం


మౌనిక(ఫైల్)

మాడ్గుల, సెప్టెంబరు 12: పురుగుల మందు తాగిన యువతి చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన మాడ్గులలో చోటుచేసుకొంది. సీఐ జగదీష్ తెలిపిన వివరాల ప్రకారం.. మాడ్గులకు చెందిన చిక్కుడు మౌనిక(19) హైదరాబాద్‌లో డిగ్రీ చదువుతోంది. రెండు మూడు రోజుల క్రితం ఆమె ఇంటికొచ్చిందని తల్లిదండ్రులు అలివేలు, రాములు చెప్పారన్నారు. బుధవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో మౌనిక పత్తిచేనుకు కొట్టే పురుగుల మందు తాగిందని తెలిపారు. తల్లిదండ్రులు పొలం నుంచి వచ్చి చూసేసరికి మౌనిక చావుబతుకుల్లో ఉందన్నారు. ఆమెను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందూతూ గురువారం మృతిచెందినట్లు సీఐ వివరించారు. మౌనిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జగదీష్ తెలిపారు. కాగా తన కూతురి ఆత్మహత్యపై తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కందుకూరు, సెప్టెంబరు 12:పులుగుల మందు తాగిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం తెల్లవారు జామున మృతిచెందినట్లు ఎస్ఐ సైదులు తెలిపారు. గ్రామంలో ముగ్గురి వేధింపుల వల్లే తన తమ్ముడు ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి అన్న పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మురళీనగర్‌కు చెందిన ముడావత్ పురందాస్(32), అదే గ్రామానికి చెంది న ఓ వివాహితతో పరిచయమై చనువుగా మెదిలారు. అయితే వారి మధ్య మనస్పర్థలొచ్చాయి. ఈ నెల 7న అదే గ్రామానికి చెందిన కె.కిరణ్, వి.గురుసింగ్, కవిత అనే మహిళ కలిసి పురందాస్‌కు ఫోన్ చేసి బెదిరించారు. దీంతో అతడు అదే రాత్రి 9:30గంటలకు తన పొలానికి వెళ్లి పురుగుల మందు తాగాడు. విషయాన్ని తన అన్న శంకర్‌కు ఫోన్ చేసి చెప్పాడు. శంకర్ పొలానికి చేరుకొని పురందాస్‌ను చికిత్స నిమిత్తం నగరశివారులోని ఓవైసీ ఆస్పత్రికి తరలించాడు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు శంకర్ తెలిపాడు. అతడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కారుకు నిప్పుపెట్టిన వ్యక్తిపై కేసు నమోదు

మాడ్గుల, సెప్టెంబరు 12:చంద్రాన్‌పల్లిలో బుధవారం రాత్రి దోనాల కృష్ణారెడ్డి తన కారును ఇంటి ముందు పార్క్ చేశాడు. రాత్రి ఎవరూ లేని సమయంలో గ్రామానికే చెందిన వెల్దండ జంగారెడ్డి పెట్రోల్ పోసి కారును దహనం చేశాడు. కృష్ణారెడ్డి తల్లి భారతమ్మ మంటలు చూసి మంటలార్పారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జగదీష్ తెలిపారు.

టిప్పర్ ఢీకొని కూలిన ఆసుపత్రి ప్రహరీ

కొందుర్గు, సెప్టెంబరు 12 : టిప్పర్ ఢీకొని ప్రభుత్వ ఆసుపత్రి గోడ కూలిన ఘటన కొందుర్గులో గురువారం జరిగింది. ఆసుపత్రి పక్కన ఉన్న వారికి మట్టి పోసేందుకు వచ్చిన టిప్పర్ పీహెచ్‌సీ ప్రహరీని ఢీకొంది. ఈ విషయమై ఆసుపత్రి సిబ్బంది టిప్పర్ డ్రైవర్‌తో మాట్లాడారు. అనుకోకుండా కూలిన గోడను నిర్మిస్తామని డ్రైవర్ వారితో చెప్పాడు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

షాద్‌నగర్ రూరల్, సెప్టెంబరు12 : విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని షీ టీమ్ ఏఎస్సై గోపాల్‌రెడ్డి తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం కిషన్‌నగర్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు మత్తుపదార్థాలపై అవగాహన కల్పించారు. డ్రగ్స్ తీసుకుంటే ఆరోగ్యం, జీవితాలు పాడవుతాయన్నారు. డ్రగ్స్ సమాచారం తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని తెలిపారు. ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, సోషల్ మీడియాలో వేధింపులకు పాల్పడితే తమ దృష్టికి తేవాలని సూచించారు. కార్యక్రమంలో టీచర్లు, షీ టీమ్ సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న ఏఎస్సై గోపాల్‌రెడ్డి

మల్కీజ్‌గూడ బుక్ కీపర్‌పై డీఆర్‌డీవో పీడీకి ఫిర్యాదు

యాచారం, సెప్టెంబరు 12: మండలంలోని మల్కీజ్‌గూడకు చెందిన డ్వాక్రా పొదుపు సంఘ బుక్‌కీపర్ రాణి అనేక అక్రమాలకు పాల్పడుతున్నారని గురువారం డీఆర్‌డీవో పీడీ శ్రీలతకు డ్వాక్రా సంఘ సభ్యులు ఫిర్యాదు చేశారు. నెల రోజుల క్రితం లక్ష్మీసరస్వతి గ్రూప్‌నకు చెందిన పది మంది సభ్యులకు ఇటీవల బ్యాంక్‌లోన్ రూ.14,42,200 లోన్ మంజూరైందన్నారు. ఈ డబ్బును బుక్‌కీపర్ వరికుప్పల రాణి సభ్యుల ఖాతాల్లోకి మళ్లించకుండా లీడర్లకు తెలియకుండా తెల్ల కాగితాలపై సంతకాలు చేయించుకుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. 10మంది సభ్యులు ఒక్కొక్కరికి రూ.1.4లక్షల చొప్పున లోన్ వచ్చినా ఇవ్వలేదని సభ్యులు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా శ్రీవల్లి పొదుపు సంఘం లీడర్ల సంతకాలు లేకుండానే ఫోర్జరీ సంతకాలు చేసి రూ.25 వేలు డ్రా చేశారని ఫిర్యాదులో తెలిపారు. వీటిపై ఏపీఎం, ఎంపీడీవోలకు ఫిర్యాదు చేశామని సంఘం సభ్యులు వివరించారు.

పూజలందుకుంటున్న విఘ్నేశ్వరుడు


శంకర్‌పల్లిలో నిర్వహించిన వినాయకుడి పూజలో పాల్గొన్న చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య


మైసిగండిలో వినాయక పూజల్లో శ్రీనివాస్‌గౌడ్, తులసీరామ్, మదన్ లాల్


యాచారం: మాల్‌లో గణనాథున్ని ఊరేగిస్తున్న భక్తులు


కడ్తాలో హనుమాన్ యూత్ వినాయక నిమజ్జన వేడుకల్లో పాల్గొన్న స్థానికులు


ఆమనగల్లులో నిమజ్జనోత్సవంలో పాల్గొన్న యువకులు

సంక్షిప్తంగా...

- **ఆమనగల్లు:** ఆమనగల్లు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 16న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డి, పీఆర్వో ఎంఏ పాషా గురువారం తెలిపారు. ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఎనుగొండ రాంరెడ్డి లయన్స్ కంటి ఆసుపత్రి, లయన్స్‌క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని లక్ష్మారెడ్డి, పాషా కోరారు.
- **ఆమనగల్లు:** ఆమనగల్లు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు ఈ నెల 14న సన్మాన, అభినందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డి, పీఆర్‌వో పాషా తెలిపారు. బండ్లగూడ నాగోలు పీబీఆర్ కన్వెన్షన్‌లో కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమానికి రిటైర్డ్ ప్రొఫెసర్ కసిరెడ్డి వెంకట్ రెడ్డి, లయన్స్ క్లబ్ వైస్ గవర్నర్ మహేంద్రకుమార్‌రెడ్డి, సురేశ్ హాజరవుతున్నట్లు తెలిపారు.

ఆమనగల్లు: మండల పరిధి కోనాపూర్ గ్రామానికి చెందిన మైలారం ఆగయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. గురువారం మృతుడి కుటుంబాన్ని ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ పరామర్శించారు. బాధిత కుటుంబానికి చారిటబుల్ ట్రస్ట్ తరఫున రూ.3వేలు ఆర్థిక సాయం సమకూర్చగా స్థానిక నాయకులు అందజేశారు. పరామర్శించిన వారిలో నాయకులు కడారి రాజు, జంగయ్య, రవి, శేఖర్, పెంటయ్యరాజు, శ్రీను తదితరులు ఉన్నారు.

- **తలకొండపల్లి:** జూలపల్లిలో నిర్వహించిన వైద్య శిబిరం విజయవంతమైంది. హైదరాబాద్ కామినేని ఆసుపత్రి సహకారంతో ఉప్పల చారిటబుల్‌ట్రస్ట్ చైర్మన్ వెంకటేశ్ ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించారు. డాక్టర్లు అఖిల్, అనిల్ 189మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు.

కడ్తాల్ ఎంఈవోగా భానునాయక్



కడ్తాల, సెప్టెంబరు 12 : కడ్తాల మండల విద్యాధికారిగా ఆర్.భానునాయక్ నియమితులయ్యారు. ఆయన తలకొండపల్లి ఇన్‌చార్జి ఎంఈవోగానూ అదనపు బాధ్యతలు నిర్వహించాలని జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.